క్లుప్తంగా

అలరించిన సినీ సంగీత విభావరి



మధురానగర్(విజయవాడసెంట్రల్): దావు బుచ్చయ్యకాలనీ తొమ్మిదోలైన్‌లో పర్యావరణ గణపతి వినాయక చవితి మహోత్సవాల్లో భాగంగా మంగళవారం ఏర్పాటు చేసిన సినీ సంగీత విభావరి భక్తులను అలరించింది. గాయకులు ఆలపించిన సినీ భక్తి గీతాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. సినీ సంగీత విభావరి ఆద్యంతం ప్రేక్షకులను రంజింప చేసింది.

బాస్కెట్ బాల్ పోటీలకు విద్యార్థిని ఎంపిక



భవానీపురం(విజయవాడపశ్చిమ): ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఏపీ ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో త్వరలో జరుగనున్న ఉమ్మడి కృష్ణాజిల్లా బాస్కెట్ బాల్ పోటీలకు అట్కిన్సన్ (గొల్లపూడి) పాఠశాలలో 9వ తరగతి విద్యార్థిని కె.రిషిత సాగర్ ఎంపికైంది. ఈ నెల 16న నూజివీడులోని బేతెస్థ ఇంటిగ్రేటెడ్ స్కూల్ క్యాంపస్‌లో జరిగిన బాలబాలికల ఎంపికలో అండర్-14 బాలికల విభాగంలో రిషిత సాగర్ కనబరిచిన ప్రతిభతో పోటీలకు ఎంపిక చేసినట్లు కోచ్ ఎస్.సంతోష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ తోట అజయ్‌కుమార్ నేతృత్వంలో నిర్వహించనున్న బాస్కెట్ బాల్ పోటీల్లో ఉమ్మడి కృష్ణా జిల్లా తరపున పాల్గొనేందుకు ఈ ఎంపికలు జరిగాయిని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అట్కిన్సన్ హైస్కూల్ ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ ఫాతిమ పావని రిషిత సాగర్‌ను అభినందించారు.

మధురంగా సాగిన దాస పదామృతం



విజయవాడ కల్చరల్: స్వరఝరి సంగీత సంస్థ ఆధ్వర్యంలో నెల వారీ కార్యక్రమంలో భాగంగా గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికమీద మంగళవారం నిర్వహించిన దాస పదామృత కార్యక్రమం సంగీత వైభవాన్ని చాటింది. సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్ వాగ్గేయకారులు, భక్తి తత్వవేత్తలు త్యాగరాజ స్వామి కీర్తన గిరిరాజ సుత, తూము నరసింహదాసు లేరానా సామి, పరాకుంశదాసు శ్రీరాముల, బొమ్మరాజు సీతారామదాసు భక్తి భిక్షాందేహి, మన్నెకొండ హనుమదాసు, పరమాత్మ, పురందరదాసు కలియుగదల్లి, రామదాసు తక్కువేమి మనకు తదితర కీర్తనలను మధురంగా గానం చేశారు. వయోలిన్‌పై పాలపర్తి నాగేశ్వరరావు, వీణపై శశిధర్, మృదంగంపై సద్గురు చరణ్, ఘటంపై కేవీ కిషోర్ సహకరించారు. లంకతేజస్వి భక్త దాసుల కీర్తనల వైభవాన్ని వివరించారు. కార్యక్రమంలో అంజనా సుధాకర్. పారుపల్లి సుబ్బరాయఫల్గణ్, వేమూరి విశ్వనాథ్ పాల్గొన్నారు.

కరాటేలో సత్తా చాటిన నలంద విద్యార్థులు

జాతీయ స్థాయి పోటీల్లో మెడల్స్



లబ్బీపేట(విజయవాడతూర్పు): నెల్లూరులోని సోమిశెట్టి కల్యాణ మండపంలో ఈ నెల 17న జరిగిన జాతీయ స్థాయి ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ 2023 పోటీల్లో నలంద విద్యార్థులు సత్తా చాటారు. అండర్-12 విభాగంలో నిర్వహించిన ఈ పోటీల్లో దేశంలోని అన్ని రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో పాల్గొన్న నలంద విద్యానికేతన్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ చూపారు. అండర్-11 విభాగంలో ఐదో తరగతి విద్యార్థిని అల్విన్ గోల్డ్ మెడల్ సాధించగా, అండర్-12 విభాగంలో తొమ్మిదో తరగతి విద్యార్థి కోట చరిష్ బ్రాంజ్ మెడల్‌ను గెలుపొందాడు. విజేతలను మంగళవారం స్కూల్ ప్రిన్సిపాల్ మాదల పద్మజ అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రమాదం ఎదురైతే ఎదిరించేలా ఉండాలన్నారు. ఆత్మరక్షణ విద్యలు నేర్పడంద్వారా మాత్రమే ఆత్మవిశ్వాసం పెరిగి భయం పోతుందన్నారు. విజేతలు ఢిల్లీ, హర్యానాలో జరగనున్న ఇంటర్నేషనల్ పోటీల్లో కూడా సత్తా చాటి మెడల్స్ సాధించాలని ఆకాంక్షించారు.

జోరుగా రోడ్డు పనులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): 30వ డివిజన్‌లో రోడ్డు పనులు వేగవంతం చేశారు. ఇప్పటి వరకు రోడ్డు కన్నా యూజీడీ మ్యాన్‌హోల్స్ ఎత్తులో ఉండటంతో వాహన చోదకులు పాదచారులు ఇబ్బందులు పడేవారు. ఇప్పుడు రోడ్డు పనులలో భాగంగా యూజీడీ మ్యాన్‌హోల్‌తో సమానంగా రోడ్డును సరిచేశారు. రోలింగ్ చేస్తూ వాహనాల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా చవితి వేడుకలు

వాడ వాడలా విఘ్నేశ్వరుడికి పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నగరంలో సోమవారం వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీలు, భక్త బృందం ఆధ్వర్యంలో వారి శక్తి కొలది విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు చేశారు. కులమతాలు, రాజకీయాల కతీతంగా వినాయక చవితి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ముత్యాలంపాడు శ్రీషిరిడీ సాయి బాబా మందిరంలో వినాయక చవితి వేడుకలలో భాగంగా సహస్ర కుడుముల అర్చన జరిగింది. కార్యక్రమంలో మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు యాదల శ్రీనివాసరావు, కుంచనపల్లి రవిశంకర్ పాల్గొన్నారు. దుర్గాఅగ్రహారంలో శ్రీ లక్ష్మీగణపతి సేవాసమితి ఆధ్వర్యాన వినాయక చవితి వేడుకలు ప్రారంభమయ్యాయి. భారీ పంచముఖ వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ప్రసాద్ దంపతులు పీటల మీద కూర్చుని పూజలు చేశారు. అంబేడ్కర్ కాలనీలో జరిగిన వినాయక చవితి వేడుకలలో స్థానిక కార్పొరేటర్ పెనుమత్స శిరీషా పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్న ప్రసాద వితరణను వైఎస్సార్ సీపీ డివిజన్ అధ్యక్షుడు పెనుమత్స సత్యం ప్రారంభించారు. మధురానగర్ నేతాజీ కాలనీ రమాదేవి నగరపాలకసంస్థ పాఠశాల సమీపంలో జరిగిన వినాయక చవితి వేడుకలలో స్థానిక కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, వైఎస్సార్ సీపీ నగర అధికార ప్రతినిధి కంభం కొండలరావు పాల్గొన్నారు. భోనం నాగు ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అయోధ్యనగర్‌లో ఓం శ్రీ శక్తి గణపతి మహోత్సవం కమిటీ నిర్వహించిన వినాయక చవితి ఉత్సవాలలో వైఎస్సార్ సీపీ నాయకులు ఒగ్గు గవాస్కర్ పాల్గొన్నారు. ఆయా కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కె బాలాజీ, జీ కల్యాణ చక్రవర్తి, పెద్దిరాజు పాల్గొన్నారు. శ్రీనగర్ కాలనీలో వరసిద్ధి వినాయక ఉత్సవ కమిటీ కటారి వెంకట సాయి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక చవితి ఉత్సవాలలో ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొని పూజలు చేశారు. మధురానగర్ శ్రీభగవాన్ షిరిడీ సాయిబామందిరంలో వినాయక చవితి ఉత్సవాలలో మందిర గౌరవాధ్యక్షురాలు పిల్లి లక్ష్మీతులసి దంపతులు పూజలు చేశారు.



కస్తూరిబాయిపేటలో వినాయకుడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, కార్పొరేటర్ అనిత కోవాలి

వినాయకునికి ఎమ్మెల్యే విష్ణు ప్రత్యేక పూజలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): కస్తూరిబాయిపేట వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొని వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో 24వ డివిజన్ కార్పొరేటర్ కుక్కల అనిత, ఓబిరెడ్డి వెంకట్రామిరెడ్డి, మోహనరావు, కుక్కల రమేష్, క్రాంతి పాల్గొన్నారు.

పర్యావరణ హితంగా పండగలు జరుపుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రతిఒక్కరూ పర్యావరణ హితంగా పండగలు జరుపుకోవాల్సిన అవసరం ఉందని లయన్స్‌క్లబ్ నాయకులు నెక్కంటి ప్రసాద్ అన్నారు. స్థానిక మధురానగర్ మెయిన్ రోడ్డులో సోమవారం వినాయకచవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా లయన్స్ క్లబ్ ఆఫ్ విజయవాడ ఈస్ట్ ఇంపాక్ట్ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు కేవీ రామశాస్త్రి, సెక్రటరీ రవితేజ, కోశాధికారి పెద్దిరెడ్డి వెంకటేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో ..

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా ప్రారంభమయ్యాయి. విజయ గణపతిని సోమవారం పసుపుతో అలంకరించి పూజలు చేశారు. మంగళవారం కుంకుమతో అలంకరించి పూజలు నిర్వహించారు. బుధవారం చందనంతో అలంకరించి పూజలు నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకులు అవ్వా హేమసుందర వరప్రసాద్ తెలిపారు.



దత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో గణపతికి కుంకుమతో అలంకారం



తన కార్యాలయంలో వినాయకుడికి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే విష్ణు



మధురానగర్ షిరిడీ సాయి బాబా మందిరంలో..

సింగ్‌నగర్‌లో..

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): వినాయక చవితి వేడుకలు సింగ్‌నగర్, న్యూరాజరాజేశ్వరీపేట, వాంబేకాలనీ, ఆంధ్రప్రభకాలనీ, నందమూరినగర్, అమరావతి కాలనీ పరిసర ప్రాంతాల్లో ఘనంగా జరిగాయి. ఎమ్మెల్యే మల్లాది విష్ణు, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజలు పలు వినాయక చవితి పందిళ్లకు విచ్చేసి ప్రత్యేక పూజలు చేశారు.

నిత్యాన్నదానం ఎంతో పుణ్యం

పాయకాపురం(విజయవాడరూరల్): వినాయక చవితి నవరాత్రుల సందర్భంగా భక్తులకు నిత్యం అన్నదానం చేయడం ఎంతో పుణ్యమని ఏపీ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 64వ డివిజన్ కండ్రికలో శ్రీలక్ష్మీ గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో జరుగుతున్న వినాయక చవితి నవరాత్రి వేడుకల్లో ఎమ్మెల్యే మల్లాది విష్ణు మంగళవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కె.రవికుమార్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం కండ్రికలో వినాయక చవితి వేడుకలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కె.రవికుమార్, అల్లు మహేష్, అల్లు నరేంద్ర కుమార్, పల్లెల రవి, పొలిశెట్టి చంద్రశేఖర్, పటంశెట్టి నాగఫణి, కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మ శ్రీరాములు పాల్గొన్నారు. 61వ డివిజన్లో జరిగిన వినాయక చవితి వేడుకల్లో కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి పాల్గొన్నారు. 62వ డివిజన్లో జరిగిన వినాయక చవితి వేడుకల్లో కార్పొరేటర్ అలంపూరు విజయలక్ష్మి పాల్గొన్నారు. 63వ డివిజన్లో కార్పొరేటర్ మోదుగుల తిరుపతమ్మ వినాయక చవితి వేడుకల్లో పూజలు చేశారు.



కండ్రికలో వినాయకస్వామి పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు



ముత్యాలంపాడులో పూజలు చేస్తున్న డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి



బేడ్కర్ కాలనీలో భోజనాలు వడ్డిస్తున్న పెనుమత్స సత్యం



గంగానమ్మగుడి వద్ద ఏర్పాటుచేసిన చవితి పందిరిలో డెప్యూటీ మేయర్ శ్రీశైలజ దంపతులు



మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు



సింగ్‌నగర్‌లో వినాయకచవితి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ రుహుల్లా, నిర్వాహకులు

అన్ని వర్గాల అభ్యున్నతే ధ్యేయం

ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 64వ డివిజన్ 282వ వార్డు సచివాలయ పరిధిలో మంగళవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, స్థానిక కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మతో కలిసి ఆయన పాల్గొన్నారు. కండ్రిక, ఎస్ఎస్‌సీ బోస్‌నగర్లో విస్తృతంగా పర్యటించి 429 గడపలను సందర్శించారు. ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల బ్రోచర్లను అందచేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

అవినీతి బాబు తరఫున టీడీపీ ఎంపీల పోరాటమా

విభజనతో రాష్ట్రం తీవ్రంగా నష్టపోవడానికి ప్రధాన కారణం చంద్రబాబు రెండు కళ్ల సిద్ధాంతమని ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. ప్రత్యేక హోదా సహా విభజన హామీల సాధన కోసం వైఎస్సార్ సీపీ ఎంపీలు అలుపెరగని పోరాటం చేస్తుంటే, టీడీపీ ఎంపీలు మాత్రం బాబును అరెస్ట్ చేశారని గగ్గోలు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. రాష్ట్ర హక్కులు కాపాడటంలో చొరవ చూపాల్సిన టీడీపీ ఎంపీలు అవినీతికి పాల్పడిన చంద్రబాబును సమర్థించడం సిగ్గుచేటన్నారు. పైగా సానుభూతి కోసం ఢిల్లీలో దీక్షలు చేయడం, రాష్ట్ర పరువును తీయడమేనని పేర్కొన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో రూ.371 కోట్ల అవినీతి జరిగినట్లు సీఐడీ అధికారులు లోతైన విచారణలో స్పష్టంగా తేలిందన్నారు. ఈ కేసులో ప్రాథమిక ఆధారాలు ఉన్నట్లుగా నిర్ధారించుకున్న తర్వాతే కోర్టు చంద్రబాబుకు జుడీషియల్ కస్టడీ విధించిందన్నారు. ఎవరెన్ని సానుభూతి డ్రామాలాడినా, వాస్తవాలు ప్రజలకు తెలుసునని పేర్కొన్నారు. ఈ సారి ఎన్నికల్లో చంద్రబాబును శాశ్వతంగా ఇంట్లో కూర్చోబెట్టడం ఖాయమన్నారు. కార్యక్రమంలో డీఈ (ఇంజినీరింగ్) గురునాథం, డీఈ (యూజీడీ అండ్ వాటర్ సప్లై)రామకృష్ణ, ఏఎంహెచ్ఓ రామకోటేశ్వరావు, వైఎస్సార్ సీపీ ఎస్టీఆర్ జిల్లా కార్యదర్శి మేడా రమేష్, నాయకులు యరగొర్ల శ్రీరాములు, ఎస్కే ఇస్మాయిల్, జిల్లెల శివ, పందిరి వాసు, మాతా మహేష్, కొక్కిలిగడ్డ నాని, నరసింహారావు, వెంకటేశ్వరమ్మ, రావి విమల, తులసమ్మ, దేవిరెడ్డి సంజీవరెడ్డి, సాదం శ్రీనివాసరావు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

నిమజ్జనానికి ప్రత్యేక భద్రత

డీసీపీ విశాల్‌గున్ని

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): వినాయక చవితి పండగను పురస్కరించుకుని నగరంలో ఏర్పాటు చేసిన నిమజ్జన ప్రాంతాల్లో ప్రత్యేక భద్రతా చర్యలను పర్యవేక్షించనున్నట్లు నగర డెప్యూటీ పోలీస్ కమిషనర్ విశాల్‌గున్ని చెప్పారు. ఉత్సవ నిర్వాహకులు సోమవారం నుంచే వినాయక నిమజ్జనానికి తరలివచ్చారన్నారు. దీని దృష్ట్యా నగరంలో సోమవారం డీసీపీ విశాల్‌గున్ని నిమజ్జనానికి అనువైన ప్రదేశాలుగా కృష్ణలంక పీఎస్ పరిధిలోని సీతమ్మవారి పాదాలు సమీపంలోని ఘాట్, నున్న పీఎస్ పరిధిలోని పోలవరం కాలువలను ఎంపిక చేశామన్నారు. సీపీ ఆదేశాల మేరకు ఆయా ప్రాంతాల్లో పోలీస్ శాఖతోపాటు, మునిసిపాలిటీ, రెవెన్యూ, విద్యుత్, అగ్నిమాపక శాఖలతో సమన్వయం చేసుకుని నిమజ్జన ఘట్టాన్ని పూర్తి చేయడానికి ఏర్పాట్లు చేశామని తెలిపారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఎస్‌డీఆర్ఎఫ్ బలగాలను అందుబాటులో ఉంచి పర్యవేక్షిస్తున్నట్లు ఆయన తెలిపారు. లైటింగ్, బారికేడ్లను ఏర్పాటు చేశామన్నారు. తనిఖీల్లో నార్త్ డివిజన్ ఏసీపీ సీహెచ్ రవికాంత్, సౌత్ ఏసీపీ రవికిరణ్, ఇన్‌స్పెక్టర్లు దుర్గారావు, శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.



సీతమ్మ పాదాల వద్ద నిమజ్జన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న డీసీపీ విశాల్‌గున్ని

శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దు

పటమట(విజయవాడతూర్పు): వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజలు ఏర్పాటు చేసిన గణేష్ మండపాల వద్ద ప్రభుత్వ నిబంధనలు పాటిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సెంట్రల్ డివిజన్ ఏసీపీ పి. భాస్కరరావు సూచించారు. ఆటోనగర్ లోని ఏటిపి హాల్లో పటమట సీఐ కాశీ విశ్వనాథ్ ఆధ్వర్యంలో పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో 150 గణేష్ మండపాల నిర్వాహకులతో మండపాల వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి సోమవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని, ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ప్రతి మండపం వద్ద పాయింట్స్ బుక్స్ ఏర్పాటు చేయాలని, పోలీస్ అధికారులు, బ్లూకోల్ట్స్ సిబ్బంది తరచూ తనిఖీ చేస్తార తెలిపారు. మండపాల వద్ద అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే మండప నిర్వహకులే పూర్తి బాధ్యత వహించాలన్నారు. వినాయక చవితి నుంచి నిమజ్జనం వరకు పూర్తి బాధ్యతలను నిర్వాహకులు తీసుకోవాలని తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారి పట్ల కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్సైలు పద్మ, సత్యనారాయణ, శాతకర్ణి, విక్రమ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ భాస్కరరావు

పురోహితుల సమస్యల పరిష్కారానికి కృషి

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురం శారద జంక్షన్‌కు ఆది శంకర సర్కిల్‌గా ప్రభుత్వం నామకరణం చేయడం నగరంలోని హిందువులందరికీ గర్వకారణం అని ఎమ్మెల్యే మల్లాది విష్ణు పేర్కొన్నారు. బీఆర్‌టీఎస్ రోడ్డుకు ఆదిశంకర నామకరణం చేయడాన్ని స్వాగతిస్తు పురోహిత సంఘం ప్రతినిధులు, సనాతన ధర్మ రక్షణ సేవా ప్రతినిధులు మంగళవారం ఎమ్మెల్యే విష్ణు, స్థానిక కార్పొరేటర్ శర్వాణీమూర్తిని శారద జంక్షన్‌లో కలసి కృతజ్ఞతలు తెలిపారు. త్వరలోనే ఈ సెంటర్‌లో శంకరాచార్య విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేయాల్సిందిగా పురోహిత సంఘం అధ్యక్షుడు తూములూరి శ్రీకృష్ణచైతన్య ఎమ్మెల్యే విష్ణు దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే విష్ణు ఆదిశంకరా చార్య చిత్రపటానికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హిందుత్వానికి ప్రభుత్వం ఎప్పుడూ రక్షణగా ఉంటుందన్నారు. పురోహితుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. దసరాలో పు ఆదిశంకరాచార్య విగ్రహం ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తానని తెలిపారు. సనాతన ధర్మ రక్షణ సేనా ప్రతినిధులు హర్ష శర్మ, పద్మనాభ శర్మ, పొన్నపల్లి గణపతి శర్మ, పురోహిత సంఘ సభ్యులు కిషోర్, రామ్మూర్తి, నాగేంద్ర, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఆంజనేయరాజు కళారంగ సేవలు ఆదర్శనీయం

విజయవాడ కల్చరల్: సాహితీ సాంస్కృతిక రంగ ప్రముఖుడు బోడి ఆంజనేయరాజు సేవలను ఆదర్శంగా తీసుకోవాలని ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ సంగీత కళాశాల విశ్రాంత అధ్యాపకుడు కేవీ బ్రహ్మానందరావు అన్నారు. తెలుగు కళావాహిని, ఆంధ్రా ఆర్ట్స్ అకాడమీ, కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో నవ కథావైతాళికుడు గురజాడ అప్పారావు వర్ధంతి, గణేష మహోత్సవాల ముగింపు సందర్భంగా గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో సోమవారం సినీ సంగీత విభావరి, సాహితీవేత్త బోడి ఆంజనేయరాజుకు ఆత్మీయ సత్కార కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. బ్రహ్మానందరావు మాట్లాడుతూ ఆంజనేయరాజు 30 సంవత్సరాలుగా నగరంలో సాహిత్య కార్యక్రమాలు నిర్వహణలో కీలకమైన పాత్ర పోషించినట్లు తెలిపారు. న్యాయవాది హేమలత ఆంజనేయరాజు సాహితీ సేవలను వివరించారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు ఆధ్వర్యంలో ఆంజనేయరాజు దంపతులను సత్కరించారు. గాయకులు డేవిడ్‌రాజు, శ్యాంప్రసాద్, జయప్రభ, పావని, వడ్డాది కామేశ్వరి, షబానా క్లాసికల్ గీతాలను ఆలపించారు.

నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి

పటమట(విజయవాడతూర్పు): వినాయక చవితి పండగను పురస్కరించుకుని వినాయక విగ్రహ నిమజ్జనాల సమయంలో అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఏ విధమైన ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని విజయవాడ మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. కృష్ణా నది ప్రాంతంలో ప్రకాశం బ్యారేజీ దిగువన, శనీశ్వర గుడి వెంబడి విగ్రహాల నిమజ్జనం చేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నిమజ్జనాలు బుధవారం నుంచి చేయవచ్చని, అందుకు అవసరమైన క్రేన్లు, ఇతర సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఆయా పరిసరాలలో ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణను చేపట్టి నదిలో వ్యర్థాలు వేయకుండా చెత్త తరలించు వాహనాలను ఏర్పాటు చేశామన్నారు. నగరంలో విగ్రహ నిమజ్జనాలు ఇక్కడ తప్ప, మరో చోట చేసినా వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విగ్రహ నిమజ్జనం చేయు సమయంలో ఉత్సవ కమిటీ నిర్వాహకులు తగు జాగ్రత్తలు తీసుకుని ఎటువంటి అపశ్రుతులు జరగకుండా అధికారులతో సహకరించి వారి సూచనలు పాటించాలని పేర్కొన్నారు. పూజకు ఉపయోగించిన సామగ్రి, పుష్పాలు, ఆకులు, పండ్లను నిరుపయోగంగా నదిలో లేదా కాలువలో వేయకుండా విజయవాడ నగరపాలక సంస్థ సిబ్బందికి అందించాలని తెలిపారు. పూజా సామగ్రిని గ్రీన్ వేస్ట్ రీసైక్లర్లు వారితో కలిసి వినూత్నంగా చేపట్టిన ఫ్లవర్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్ ద్వారా నిరుపయోగమైన పువ్వులను పరిమళమైన అగరబత్తీలు, దూపాలను తయారు చేస్తామని పేర్కొన్నారు. ఆకులు, చెట్లను బయో మెథనైజేషన్ ప్లాంట్‌కు మిగిలిన వ్యర్థాలను విండో కంపోస్టింగ్ ద్వార ఎరువుగా తయారుచేస్తామని తెలిపారు.



కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సూర్యారావుపేట సెక్షన్, మాచవరం సబ్ స్టేషన్, 11కేవీ మాచవరం ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, నిర్వహణ నిమిత్తం బుధవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ విజయవాడ టౌన్ ఈఈ బీవీ సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. గుణదల పడవలరేవు ఏరియా, పిచ్చమ్మ తల్లి గుడి మొత్తం ఏరియా, మాచవరం రెవెన్యూ కాలనీ అన్ని లైన్లు, మాచవరం గ్రంథాలయం ఏరియా, మాచవరం డౌన్ కొండవైపు ఏలూరు రోడ్ ఏరియా, కార్మికనగర్ కొండ ప్రాంతం మొత్తం, యారం వారి వీధి, యెలిశేల వారి వీధి, వాటర్ ట్యాంక్ రోడ్, ప్రతిభానికేతన్ రోడ్, తదితర ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఆయా ప్రాంతాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

స్వచ్ఛ విజయవాడ స్థాపనపై ప్రత్యేక శ్రద్ధ

వంతెనల వద్ద కాలువల్లో చెత్త వేయకుండా ఐరన్ గ్రిల్స్ ఏర్పాటు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): స్వచ్ఛ విజయవాడ నగర స్థాపనకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. ఇళ్లలో వచ్చే చెత్తను ఎక్కడపడితే అక్కడ పడవేయకుండా ఉండాలంటూ ప్రజలకు అవగాహన కల్పిస్తూనే చెత్త వేసే ప్రదేశాల వద్ద ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటుచేయడం, మైకు ప్రచారం, ఐరన్ గ్రిల్స్‌ను ఏర్పాటుచేయడం వంటి చర్యలను తీసుకుంటూ నగర ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

ఐరన్‌గ్రిల్స్ ఏర్పాటు

బుడమేరులో పెద్ద ఎత్తున చెత్త పేరుకుపోయి అక్కడ దోమల వ్యాప్తికి అధిక కారణంగా మారుతున్నాయి. ఈ సమస్యను గుర్తించిన అధికారులు నగరంలో ఉన్న వంతెనలన్నింటి వద్ద చెత్త పడేయకుండా రక్షణ చర్యలు చేపట్టారు. బుడమేరు ప్రవహించే న్యూరాజరాజేశ్వరీపేట వంతెన, దేవినగర్ వద్ద బుడమేరు వంతెన, గవర్నమెంట్ ప్రెస్ వద్ద వంతెనల వద్ద ఐరన్ గ్రిల్స్‌ను ఏర్పాటుచేయడం, ప్రత్యేక సిబ్బందిని ఉంచి ప్రజలు చెత్త వేయకుండా అవగాహన కల్పిస్తున్నారు.



బుడమేరు కాలువలో చెత్త వేయకుండా ఏర్పాటు చేసిన ఐరన్‌గ్రిల్స్

స్వచ్ఛ నగర స్థాపనకు చేతులు కలపండి

నగరాన్ని స్వచ్ఛంగా ఉంచేందుకు నగర ప్రజలంతా చేతులు కలపాలని అధికారులు ప్రజలను కోరుతున్నారు. చెత్త సేకరించే వాహనాలతో పాటు పలు కూడళ్ల వద్ద మైకులను ఏర్పాటుచేశారు.

ఘనంగా బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర వ్యవస్థాపక దినోత్సవం

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర 89వ వ్యవస్థాపక దినోత్సవాన్ని మంగళవారం పటమటలోని జోనల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా జోనల్ మేనేజర్ జీఎస్‌డీ ప్రసాద్, డెప్యూటీ మేనేజర్ రజనికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మిత్ర హాస్పిటల్, న్యూ సిటీ బ్లడ్ బ్యాంక్ సహకారంతో మెడికల్ క్యాంప్, బ్లడ్ డొనేషన్ క్యాంప్ ఏర్పాటు చేయడంతో సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అనంతరం కస్టమర్స్ సమావేశం నిర్వహించి బ్యాంక్ అభివృద్ధికి సహకరించడంపై వారికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో ఖాతాదారులకు మరిన్ని సేవలు అందించేందుకు కృషిచేస్తామని పేర్కొన్నారు.



బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర వ్యవస్థాపన దినోత్సవంలో పాల్గొన్న జోనల్ మేనేజర్ జీఎస్‌డీ ప్రసాద్